

ఘనంగా వేదనాదస్వామి

ఆలయ కుంభాభిషేకం



ప్యారీస్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కడలూరు సమీపంలోని తిరువంది పురం వేదనాదస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం నిర్వహించిన కుంభాభిషేక మహోత్సవంలో రాష్ట్రమంత్రి ఎంఆర్కే పన్నీర్ సెల్వం సహా వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. 108 వైష్ణవ దివ్యక్షేత్రాల్లో ఒకటైన వేద నాధస్వామి ఆలయానికి కుంభాభిషేకం నిర్వహించేందుకు 2023లో హిందూ దేవాదాయ శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ ఆలయంలో జీర్ణోద్ధారణ పనులు పూర్తయిన నేపథ్యంలో ఆలయప్రాంగణంలో యాగశాల ఏర్పాటు చేశారు. గత నెల 29వతేదీ పుణ్యాహవచనంతో 75మంది భట్టాచార్యులు యాగశాల పూజలు ప్రారంభించారు. గురు, శుక్రవారాల్లో అగ్నిపారాయణం, నిత్యహోమాలు, కుంభారాధన, పూర్ణాహుతి పూజలు జరిగాయి. ఆదివారం ఉదయం 10గంటలకు రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి ఎంఆర్కే పన్నీర్ సెల్వం, జిల్లా కలెక్టర్ ఆదిత్య సెంథిల్‌కుమార్ తాహసీల్దార్ అభినయ, దేవాదాయ శాఖ అధికారులు తదితరులు ప్రముఖులతో పాటు పాల్గొన్న వేలాది మంది భక్తులపై పవిత్ర జలాలను సంప్రోక్షించారు.

200 సీట్లు గెలుచుకుని

చరిత్ర సృష్టిద్దాం

● పార్టీ శ్రేణులకు స్టాలిన్ లేఖ

చెన్నై, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ద్రవిడ ఉద్యమనేత పెరియార్ జన్మించిన ఈరోడ్ తూర్పు నియోజకవర్గంలో ఓటర్లు ఇచ్చే తీర్పు 2026 శాసనసభ ఎన్నికల్లో డీఎంకే కూటమి 200 సీట్లు గెలిచేందుకు స్ఫూర్తినిస్తుందని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. ఈరోడ్ తూర్పు ఉప ఎన్నిక ప్రచారం సోమవారం ముగియనున్న నేపథ్యంలో ఆయన పార్టీ శ్రేణులకు సుదీర్ఘ లేఖ రాశారు. ద్రావిడ తరహా డీఎంకే పాలన ఈరోడ్ జిల్లాల్లో ఎన్నో ప్రజాసంక్షేమ పథకాలను అమలు చేసిందని, ఇటీవల ఆర్కేవీ రోడ్డులో రూ.29 కోట్లతో కాయగూరల సంత ప్రాంగణాన్ని ప్రారంభించానని, ఈరోడ్ ఈకేఎం అబ్దుల్‌ఘనీ మదార్సా ప్రాథమిక పాఠశాలలో కొత్తగా ఐదు తరగతి గదులు, స్మార్ట్ తరగతి గదులను కూడా ఇటీవలే ప్రారంభించామని వివరించారు. డీఎంకే ద్రావిడతరహా పాలనపై ప్రజలకున్న నమ్మకాన్ని, ఆదరణను అసత్య ఆరోపణలు, దుష్ప్రచారాలతో చెడగొట్టేందుకు ప్రతిపక్షాలు చేస్తున్న ప్రయత్నాలేవీ ఫలించడం లేదని తెలిపారు. ఈ ఉప ఎన్నికల్లో డీఎంకే అభ్యర్థిని ఎదుర్కొనలేక అన్నాడీఎంకే, బీజేపీ వంటి ప్రధాన పార్టీలు ఎన్నికలనే బహిష్కరించాయని ఆరోపించారు. డీఎంకే పాలనకు వ్యతిరేకంగా ఈ పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలు నమ్మలేరని తెలిసే ఈ పోటీ నుంచి విరమించుకున్నారని తెలిపారు. ఈరోడ్‌లో పార్టీ విజయానికి తీవ్రంగా పాటుపడాలని, ప్రభుత్వం పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రెండు పార్టీల మధ్య ఘర్షణ..

ఇదిలా ఉండగా ఈరోడ్ తూర్పు నియోజకవర్గంలో ఆదివారం ఉదయం నామ్ తమిళర్‌కట్చి (ఎన్టీకే) కార్యకర్తలు, పెరియార్ ద్రావిడ కళగం (పీడీకే) కార్యకర్తల మధ్య ఘర్షణలు జరిగాయి. ఎన్టీకే నేత సీమాన్ ద్రావిడ ఉద్యమ నేత పెరియార్ పట్ల అదేపనిగా విమర్శలు చేస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పీడీకే కార్యకర్తల దాడికి దిగారు. ఎన్టీకే అభ్యర్థి సీతాలక్ష్మి సీఎస్ఐ క్రైస్తవాలయాన్ని పార్టీ కార్యకర్తలతో కలిసి సందర్శించి వస్తూ బయట ప్రచారం చేశారు. ఆ సమయంలో అక్కడకు వచ్చిన పీడీకే కార్యకర్తలు సీమాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీమాన్‌ను బీజేపీకి మద్దతునిచ్చే కాషాయ వస్త్రధారి అని పేర్కొనేలా కార్టూన్ ఉన్న బ్యానర్‌తో ప్రదర్శన జరిపారు. ఆ సందర్భంగా రెండు పార్టీల కార్యకర్తలు ఘర్షణకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకుని రెండు పార్టీల కార్యకర్తలను అక్కడి నుండి తరిమివేశారు. ఈ సంఘటన కారణంగా గంటకు పైగా ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.



త్యాగరాజ భాగవతర్ కాంస్య విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రులు కేఎన్ నెహ్రూ, అన్బిల్ మహేష్ తదితరులు

అసెంబ్లీ ఎన్నికల్లో

ప్రత్యర్థులపై విజయం సాధిస్తా

● టీవీకే అధినేత విజయ్ శపథం

చెన్నై, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమిళగ వెట్రికళగం రాజీకీయ శత్రువులందరినీ మట్టికరపించి ఘనవిజయం సాధిస్తుందని ఆ పార్టీ నేత, ప్రముఖ తమిళ సినీనటుడు విజయ్ శపథం చేశారు. పార్టీ ప్రథమ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ శ్రేణులకు ఓ లేఖ రాస్తూ రాష్ట్రంలో 1967, 1977 నాటి రాజకీయ పరిస్థితులు మళ్ళీ రానున్నాయని, ఆ రెండు సార్లూ రాష్ట్రంలో యేళ్లతరబడి పాలించిన కాంగ్రెస్ పార్టీ, డీఎంకే చిత్తుగా ఓడిపోయిన విషయం తెలిసిందేనని, ఆ దిశగానే టీవీకే కొత్త చరిత్ర సృష్టించడం ఖాయమన్నారు. పార్టీని నిన్న మొన్న ఏర్పాటు చేసినట్లు తనకు అనిపిస్తోందని, ఇంతలోనే ప్రథమ వార్షికోత్సవం పూర్తయి రెండోవసంతంలో అడుగుపెట్టడం తనకెంతో ఆనందం కలిగిస్తోందని, ఆ ఆనందాన్ని పార్టీ శ్రేణులతో పంచుకుంటున్నానని చెప్పారు. పార్టీని ప్రారంభించముందు ప్రజా ఉద్యమ సంస్థలా పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి మంచిపేరుతెచ్చుకున్నామని, ప్రజాదరణ అధికం కావటం వల్లే మక్కల్ ఇయక్కమ్‌ను రాజకీయ పార్టీగా మార్చానని తెలిపారు. వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో ప్రజాశక్తితోనే తాము పోటీ చేయనున్నామని, ఆ ఎన్నికల్లో గెలిచి ప్రజాస్వామ్య పద్ధతిలో అధికారంలోకి వచ్చితీరుతామని, ఈ లక్ష్యం నెరవేరాలంటే పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే నియోజకవర్గాలలో తీవ్రంగా శ్రమించాలని, స్థానికులతో సన్నిహిత సంబంధాలను మెరుగుపరచుకోవాలని విజ్ఞప్తి చేశారు.



పార్టీ కార్యాలయంలో నేతల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న విజయ్

పార్టీ ఆఫీసులో నేతల విగ్రహాలు...

ఇదిలా ఉండగా టీవీకే నేత విజయ్ పనయూరులో తన నివాసం వద్దనున్న పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం ఉదయం పార్టీ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా అంబేడ్కర్, పెరియార్, కామరాజర్, స్వాతంత్ర్య సమరయోధులు వేలునాచ్చియార్, అంజలైయమ్మాళ్ విగ్రహాలను ఆవిష్కరించారు. ఆ సందర్భంగా విజయ్ ఓ సందేశం వెలువరిస్తూ పార్టీ పతాక చిహ్నంలోని రెండు అడవి ఏనుగుల బలంతో అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన శత్రువులను చిత్తుగా ఓడించడం ఖాయమని పేర్కొన్నారు.

విజయ్ వర్క్ ఫ్రమ్ హోం...! అంతే..!

● డాక్టర్ తమిళిసై ఎద్దేవా



అడయార్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు, సినీ హీరో విజయ్‌ను లక్ష్యంగా చేసుకుని బీజేపీ మహిళా నేత, మాజీ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర్‌రాజన్ విమర్శలు గుప్పించారు. నటుడు విజయ్ రాజకీయాలు చేయడం లేదని, ఆయన చేస్తున్నదంతా వర్క్ ఫ్రమ్ హోం అని ఎద్దేవా చేశారు. టీవీకే ఆవిర్భవించి యేడాది పూర్తి చేసుకున్న అంశంపై ఆమె ఆదివారం చెంగల్పట్టులో మీడియాతో మాట్లాడుతూ, ఆయన వెండితెరపైనే కనిపిస్తున్నారని, ఇకనైనా విజయ్ క్షేత్రస్థాయికి వెళ్ళి పని చేయాలని సూచించారు. ఒక్కొక్కరికీ ఒక్కో పని ఉంటుందన్నారు. అదేవిధంగా విజయ్ కూడా దూరదృష్టితో రాజకీయాలు చేయాలన్నారు. వర్క్ ఫ్రమ్ హోం, ఆన్‌లైన్‌లో పనిచేయాలని భావిస్తే మాత్రం ఏమీ చేయలేమన్నారు. మాలాంటి నేతలు, ప్రజలతో కలిసిపోయిన నేతలే సరైనవారని భావిస్తాను. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఆమె స్పందిస్తూ ప్రతి నెలా రూ.లక్ష చొప్పున వేతనం తీసుకునే సోదరీ సోదరమణులు ఇక పన్ను చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పడంతో వారంతా ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. అన్ని వర్గాలకు మేలు చేసేలా ఈ బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. తమిళనాడుకు చెందిన ఒక మహిళ ఎనిమిదో సారి కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టడం అంటే సర్వసాధారణ విజయం కాదన్నారు. బడ్జెట్ ప్రసంగాన్ని తిరుక్కురల్ సూక్తితో ప్రారంభించారని, దీన్ని చూసి తమిళ ప్రజలు గర్వపడాలని తమిళిసై సౌందర్‌రాజన్ అన్నారు.

ఈరోడ్ ఈస్ట్‌లో నేటితో ముగియనున్న ప్రచారం

ప్యారీస్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గానికి ఈ నెల 5న ఉప ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్ అనారోగ్యం కారణంగా మృతిచెందడంతో ఈ ఉపఎన్నికలో అధికార డీఎంకే తమ పార్టీ అభ్యర్థిని బరిలో దింపింది. ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే, బీజేపీ కూటమి పార్టీలు ఉప ఎన్నికను బహిష్కరించాయి. డీఎంకే అభ్యర్థిగా వీసీ చంద్రకుమార్, నామ్ తమిళర్ కట్చి అభ్యర్థిగా సీతాలక్ష్మి సహా మొత్తం 46మంది ఉప ఎన్నికలో పోటీచేస్తున్నారు. కాగా, డీఎంకే తరుపున మంత్రి ఎస్.ముత్తుస్వామి ఇంటింటా తిరిగి ప్రచారం చేస్తున్నారు. డీఎంకే మిత్రపక్షాలైన కాంగ్రెస్, డీపీఐ, ఎండీఎంకే తదితర పార్టీల నేతలు ముమ్మరంగా ప్రచారంలో పాల్గొంటున్నారు. నామ్ తమిళర్ కట్చి ఆర్గనైజర్ సీమాన్ ఈరోడ్‌లో అక్కడే వుండి, ప్రతిరోజు ప్రచార సభల్లో పాల్గొంటున్నారు. ఆదివారం వరకు ఉప ఎన్నిక ప్రచారాలు ఈ నియోజకవర్గంలో హోరెత్తించాయి. ఎన్నికల నిబంధనావళిని ఉల్లంఘించి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నామ్ తమిళర్ కట్చి సహా పలు ఇండిపెండెంట్ అభ్యర్థులపై కేసులు నమోదయ్యాయి. ఇదిలా ఉండగా సోమవారం సాయంత్రం 6గంటలతో ఎన్నికల ప్రచార ముగియనుంది. ఇందువల్ల గత రెండు వారాలుగా ఈ నియోజకవర్గంలో వారివారి అభ్యర్థులకు మద్దత్తుగా ప్రచారంచేసేందుకు వెళ్లిన పొరుగు ప్రాంతాల రాజకీయ నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గం నుండి వెళ్లిపోవాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది.. ఈ నెల 5వతేదీ ఈరోడ్ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గానికి పోలింగ్ నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు, ఈవీఎంలను సిద్ధంచేశారు. పోలింగ్ ప్రక్రియను ఉదయం నుండి సాయంత్రం వరకు వీడియోలో నమోదు చేసేందుకు సిద్ధంచేశారు. ఈ నెల 8వ తేదీ ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడికానున్నాయి.

ఎన్నూరు తీరానికి నిర్జీవంగా తాబేళ్లు





చెన్నై, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతం ఎన్నూరు సముద్రతీరానికి ఆదివారం వేకువజాము వంటి నిండా గాయాలతో 30 తాబేళ్ళ కళేబరాలు కొట్టుకొచ్చాయి. గత కొద్ది రోజులుగా సముద్రతీరంలో తాబేళ్ల కళేబరాలు కొట్టుకురావటం అధికమవుతోంది. ఇప్పటికు సుమారు వెయ్యికి పైగా తాబేళ్లు నిర్జీవంగా సముద్రతీరంలో తేలుతూ వచ్చాయి. తాబేళ్ల మృతికి కారణాలను కనుగొనే ప్రయత్నంలో అటవీ శాఖ అధికారులు తలమునకలయ్యారు. ఈ పరిస్థితుల్లోనే తాజాగా ఎన్నూరు - తాళం కుప్పం నడుమ సముద్రతీరంలో ఆదివారం వేకువజాము 30 తాబేళ్లు నిర్జీవంగా కొట్టుకువచ్చాయి. ఈ తాబేళ్లు మోటరు పడవల దిగువ చిక్కుకుని, జాలర్ల రేకుల కొక్కీల వలలో చిక్కుకుని మృతి చెంది ఉంటాయని అనుమానిస్తున్నారు. ఈ విషయం తెలుసుకుని అటవీ శాఖ అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని తాబేళ్ల కళేబరాలను స్వాధీనం చేసుకుని వాటిని పరిశీలించిన మీద అక్కడే ఖననం చేశారు.

రక్తమోడిన జాతీయ రహదారి

● ప్రైవేటు బస్సు ఓవర్‌టేక్ చేస్తుండగా ఢీకొట్టిన లారీ

● నలుగురి దుర్మరణం ● 13 మందికి తీవ్రగాయాలు ● వీరిలో ఒకరి పరిస్థితి విషమం



నుజ్జయిన బస్సు ఓవైపు భాగం



నగరి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులు



సంఘటన స్థలం వద్ద గుమికూడిన జనం

నగరి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణం సాయిబాబా గుడి సమీపంలోని తిరుపతి- చెన్నై జాతీయ రహదారి ఆదివారం రాత్రి 9 గంటలకు రక్తమోడింది. తమిళనాడుకు చెందిన ఓ ప్రైవేటు బస్సు ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తున్న సమయంలో ఎదురుగా ఓ లారీ ఢీకొట్టుకుంటూ వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో బస్సుకు ఒకపక్క సగభాగం వరకు ధ్వంసమైంది. గాయపడ్డ ప్రయాణికుల హాహాకారాలతోపాటు రోడ్డంతా రక్తసిక్తమైంది. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు కొంతసేపు నిశ్చేష్టులయ్యారు. ఆ తర్వాత తేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. బాధితులను స్థానికులు, పోలీసులు, 108 వాహన సిబ్బంది కలిసి నగరి ఏరియా వైద్యశాలకు తరలించారు. డ్యూటీలోని సిబ్బంది కాకుండా వైద్యులు, ఇతర సిబ్బంది హుటాహుటిన వచ్చి బాధితులకు చికిత్స ప్రారంభించారు. ఆస్పత్రి రోదనలతో నిండిపోయింది. నగరి డీఎస్పీ అజీజ్ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

మృతులు: తిరుత్తణికి చెందిన కుమార్(60), తిరువళ్లూరుకు చెందిన ధనుష్కోటి(12), వడమాలపేట మండలంలోని సీతారామాపురానికి చెందిన పార్థసారథి నాయుడు (60) రాజేంద్రనాయుడు(54).

గాయపడిన వారు: రాధాకృష్ణ(తాడిపత్రి), సెల్వి(తిరుపతి), వెట్రివేల్ (తిరువళ్లూరు), భరత్ (తిరుపతి), మురళి (ఊత్తుకోట), రుద్రమూర్తి (తిరువళ్లూరు), సుబ్బరత్నమ్మ (తాడిపత్రి), సుధాకర్(తిరువళ్లూరు), చిన్నామలై(తిరువళ్లూరు), నాగేంద్ర (తాడిపత్రి), ఆయన తల్లి, అనూరాధ దంపతులు (శివగిరి). పరిస్థితి విషమంగా ఉన్న చిన్నామలైని తిరుపతికి తరలించారు.





మృతులు కుమార్, ధనుష్కోటి



తిరుచ్చి జిల్లా మనప్పారై సిప్కాట్ మైదానంలో ఆదివారం సాయంత్రం జరిగిన భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ వజ్రోత్సవాల ముగింపు వేడుకల్లో క్యాడెట్ల నుండి గౌరవ వందనం స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

సమాచార దర్శిని

8 నుంచి సిద్ధ మందుల ఎగ్జిబిషన్

పెరంబూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆయుష్ మంత్రిత్వశాఖ, జాతీయ సిద్ధ వైద్య పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో 8వ సిద్ధ దినోత్సవం సందర్భంగా కోట్టూపురంలోని బిర్లా ప్లానిటోరియం ప్రాంగణంలో ఈ నెల 8,9 తేదీల్లో సిద్ధ మందుల ఎగ్జిబిషన్ జరుగనుంది. 'ఆహారమే మందులు' అనే శీర్షికన ఏర్పాటుచేయనున్న ఈ ఎగ్జిబిషన్‌లో వంట గదిలో లభించే దినుసులు నుంచి రోగాలు ఎలా దూరం చేసుకోవచ్చు సహా పలు విషయాలను తెలుసుకోవచ్చన్నారు. ప్రతిరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే ఎగ్జిబిషన్‌ను ప్రజలు ఉచితంగా సందర్శించవచ్చని అధికారులు తెలిపారు.

కిలాంబాక్కం బస్టాండ్‌లో భద్రత పెంపు

పెరంబూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కిలంబాక్కం బస్టాండ్‌లో భద్రత పెంచినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే బస్టాండ్ ప్రాంగణంలోని పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి 24 గంటలు పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం వాహనాల పార్కింగ్, ప్లాట్‌ఫారంలు తదితరాల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసినట్లు, ప్రయాణికులు సుఖవంతమైన, రక్షణ కలిగిన ప్రయాణించేలా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

రక్తదాతల పేర్లు నమోదు చేయాలి

పెరంబూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రక్తదాతలు వివరాలు వెబ్‌సైట్‌లో నమోదుచేయని బ్లడ్ బ్యాంక్ లైసెన్స్ రద్దు చేస్తామని కేంద్ర మందుల నియంత్రణ కమిటీ హెచ్చరించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో బ్లడ్ బ్యాంకులున్నాయి. ఈ కేంద్రాల్లో నిర్దిష్ట మొత్తంలో రక్త యూనిట్లు రిజర్వ్‌లో ఉంచుతుంటారు. అలాగే, పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకొస్తుంటారు. కానీ కొన్ని బ్లడ్ బ్యాంక్‌లు రక్తం అందించే వారి వివరాలు వెబ్‌సైట్‌లో నమోదుచేయకుండా, రక్తాన్ని మార్కెట్లో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ విషయమై స్పందించిన కేంద్ర మందుల నియంత్రణ కమిటీ, రక్తదాతల వివరాలు తప్పకుండా వెబ్‌సైట్‌లో నమోదుచేయాలని, అలా చేయని బ్లడ్ బ్యాంక్‌ల లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించింది.

కోవిల్‌పట్టిలో పైలట్ శిక్షణ కేంద్రం

పెరంబూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టి సమీపంలో విమాన పైలెట్ల శిక్షణా కేంద్రం ఏర్పాటుకు 'టిడ్కో' చర్యలు చేపట్టింది. దేశంలో విమానయాన రంగం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో పైలెట్లకు అవసరమైన శిక్షణా కేంద్రాలు లేవు. పైలెట్ శిక్షణకు బ్రిటన్, ఫిలిప్పైన్స్, నెదర్లాండ్‌ఆస్ట్రేలియా తదితర దేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో కోవిల్‌పట్టి సమీపం నాలాట్టిన్‌పుదూర్, దోనుకల్ గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని లీజుకు తీసుకున్న ప్రైవేటు సంస్థ విమాన దళం ఏర్పాటుచేసింది. కొన్నేళ్లుగా ఇది నిరుపయోగంగా ఉంది. ఈ ప్రాంతంలో విమాన శిక్షణా కేంద్రం ఏర్పాటుచేయాలని తమిళనాడు ప్రభుత్వ పారిశ్రామిక అభివృద్ధి సంస్థ (టిడ్కో) నిర్ణయించింది. జూలైలోపు ఈ కేంద్రం అందుబాటులోకి తీసుకురానున్నట్లు టిడ్కో అధికారులు తెలిపారు.

రోడ్డు, చెరువుల మరమ్మతుకు రూ.62 కోట్లు

పెరంబూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో 'అన్నా మరుమలార్చి' పథకంలో చెరువులు, తారు రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం రూ.62.50 కోట్లు కేటాయించింది. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి గగన్‌దీప్‌సింగ్ బేదీ విడుదల చేసిన జీవోలో... రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో వివిధ పనులు చేపట్టేందుకు ఏడాదికి రూ.250 కోట్ల చొప్పున రూ.1,147.28 కోట్లు కేటాయించిందన్నారు. ఆ ప్రకారం, గత ఏడాది జూలైలో రూ.62.50 కోట్లు, సెప్టెంబరులో రూ.6.250 కోట్లు, నవంబరులో రూ.62.50 కోట్లు అందించారన్నారు. మిగిలిన రూ.62.50 కోట్లు అందించాలని రాసిన లేఖపై స్పందించిన ప్రభుత్వం, నిధులు కేటాయించిందని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

7న డీఎండీకే జిల్లా కార్యదర్శుల సమావేశం

పెరంబూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): డీఎండీకే జిల్లా కార్యదర్శుల సమావేశం ఈ నెల 7వ తేది జరుగనుంది. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో... కోయంబేడులోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 10 గంటలకు పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత నేతృత్వంలో సమావేశం జరుగనుందని తెలిపింది. ఈ నెల 12న పార్టీ 25వ వార్షికోత్సవం విజయవంతంగా నిర్వహించడంపై సమావేశంలో చర్చించనున్నట్లు, జిల్లా కార్యదర్శులు అందరూ పాల్గొనాలని పార్టీ పిలుపునిచ్చింది.

8న ప్రైవేటు జాబ్ మేళా

ప్యారీస్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాధవరం నియోజకవర్గంలోని సెయింట్ అన్నాల్ ఆర్ట్స్ కళాశాలలో ఈ నెల 8వ తేదీ ప్రైవేటు జాబ్ మేళా జరుగుతుందని కలెక్టర్ రష్మీ సిద్ధార్ధ్ ప్రకటించారు. 200 పైగా ప్రముఖ సంస్థలు సుమారు 20వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయని తెలిపారు. 8వ తరగతి నుంచి పట్టభద్రులు, ఐటీఐ, ఇంజనీరింగ్, కంప్యూటర్, టైలరింగ్ తదితర వృత్తి కోర్సులు పూర్తిచేసిన వారు అర్హులు.

జల్లికట్టు పోటీలో అపశ్రుతి

ఎద్దు కొమ్ము గొంతులో గుచ్చుకొని యువకుడి మృతి





ఎద్దును లొంగదీస్తున్న యువత (ఇన్‌సెట్లో) మృతుడు థామస్ అల్వా ఎడిసన్ (ఫైల్ ఫోటో)

పెరంబూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జల్లికట్టు పోటీల్లో పాల్గొన్న యువకుడు గొంతులో ఎద్దు కొమ్ము గుచ్చుకోవడంతో మృతిచెందాడు. నామక్కల్ జిల్లా కుమారపాళయంలో శనివారం జల్లికట్టు పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన 540 ఎద్దులు పాల్గొనగా, వాటిని అదుపుచేసేందుకు 400 మంది యువకులు బరిలో నిలిచారు. ఈ క్రమంలో, సేలం జిల్లా తలైవాసల్ ప్రాంతానికి చెందిన థామస్ అల్వా ఎడిసన్ (24) ఎద్దును పట్టుకొనే సమయంలో ఎద్దు కొమ్ము గొంతులో గుచ్చుకుంది. అతడిని వెంటనే కుమారపాళయం ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఈరోడ్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఫలించక అతను మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా నగరంలోని దిగువ ప్రాంతాల్లో సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

మాంగాడు: మాంగాడు టౌన్ పంచాయతి, రఘునాధపురం, కొళమణివాక్కం, శివన్‌తాంగళ్, సిక్కరాయపురం, పడూర్, పాదిరివేడు, సౌత్ కాలని, శ్రీనివాస నగర్, నెల్లితోపు, మహాలక్ష్మి నగర్, సత్య నగర్, కామాక్షి నగర్, అడిసన్ నగర్, శాంతి నగర్, మేల్మా నగర్, శక్తి నగర్, కేకే నగర్

మాతూర్: మాతూర్ ఎంఎండీఏ, పెరియ మాతూర్, చిన్న మాతూర్, ఆవిన్ క్వార్టర్స్, సీపీసీఎల్ నగర్, హెచ్‌డీ సర్వీస్, ఎంసీజీ అవెన్యూ, చిన్నసామి నగర్, కామరాజర్ రోడ్డు, మంజంబాక్కం, అసిసి నగర్, అగర్సన్ కాలేజి రోడ్డు, వెస్ట్ గార్డెన్, కత్తాకుళి, డిడీర్ నగర్, భాయ్ నగర్, సంగీత నగర్, శక్తి అమ్మన్ నగర్, తిరుపతి నగర్, జయరాజ్ నగర్, కుమారరాజన్ నగర్, సుభాష్ నగర్, భాను నగర్, కేవీటీ టౌన్‌షిప్, సంతోష్ కాలని, లక్ష్మి నగర్, అన్నై నగర్, జయ నగర్, పాయసంబాక్కం, కరుమారి నగర్, మూకాంబిగై నగర్, కొసప్పూర్, విళాంగాడు బాక్కం, పెరియార్ నగర్, తైయబాక్కం, చంద్ర బాక్కం, కన్నాంపాళయం

మొగప్పేర్: టీవీఎస్ కాలని, టీవీఎస్ అవెన్యూ, రౌండ్ బిల్డింగ్, ఎల్ఐసీ కాలని, చెన్నై పబ్లిక్ స్కూల్ రోడ్డు, ఈస్ట్ మొగప్పేర్ 1 నుంచి 6 వీధులు, వల్లైయాపది రోడ్డు, పుహళేంది రోడ్డు, పారి రోడ్డు

భోజనంలో బల్లి.. విద్యార్థులకు అస్వస్థత

పెరంబూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆరూర్ ప్రభుత్వ పాఠశాలలో పౌష్టికాహారం తీసుకున్న 8 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ధర్మపురి జిల్లా ఆరూర్ బాలికల మహోన్నత పాఠశాలలో సుమారు 915 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 340 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఇస్తున్నారు. ఆ ప్రకారం, శనివారం మధ్యాహ్నం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టారు.. భోజనం చేసిన కొద్దిసేపటికి మంగయర్‌కరసి (16), కీర్తన (16), దీప (17), కన్నీశ్వరి (16), రోహిణి శ్రీ (16), కనిష్క (16), సత్య (17), కయల్‌విళి (15) తదితర 15 మంది వాంతులు చేసుకుంటూ స్పృహతప్పి పడిపోయారు. ఉపాధ్యాయులు వారిని వెంటనే ఆరూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్సల అనంతరం విద్యార్థులు ఇంటికి వెళ్లారు. ఈ విషయమై ఆరూర్ తహసీల్దార్ పాఠశాలకు వెళ్లి తనిఖీ చేయగా, మధ్యాహ్న భోజనంలో బల్లి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే బోజనం శాంపిల్స్ ల్యాబ్‌కు పంపించారు. ఈ విషయమై మండల అభివృద్ధి అధికారులు విచారణ చేపట్టారు.

విద్యార్థులను దుర్భాషలాడిన బస్సు డ్రైవర్ సస్పెన్షన్

పెరంబూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బస్సు ఆపకపోవడంతో పాటు విద్యార్థులను దుర్భాషలాడిన డ్రైవర్‌పై సస్పెన్షన్ వేటుపడింది. పెరంబలూరు జిల్లా ఎళమూర్ గ్రామంలో ఇటీవల జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో మంత్రులు సీవీ గణేశన్, శివశంకర్ పాల్గొన్నారు. ఆ సమయంలో యూనిఫాం ధరించిన 13 ఏళ్ల విద్యార్థినీ, విద్యార్థులు మంత్రి దగ్గరకు వచ్చి, కున్నత్తం నుంచి ఎళమూరు మార్గంగా తొళుదూర్ వెళ్లే ప్రభుత్వ బస్సు బస్టాండ్‌లో నిలపడం లేదని, పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు ఇదేమని ప్రశ్నిస్తే, బస్సు డ్రైవర్ హేళనగా మాట్లాడుతున్నారని మంత్రికి ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై మంత్రి ఆదేశాలతో విచారణ చేపట్టిన అరియలూరు డిపో మేనేజర్, ఆ బస్సు డ్రైవర్ చిన్నదురై (40) అని గుర్తించి, అతనిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

పారిశ్రామిక వాడకు వ్యతిరేకంగా రైతుల నిరసన



గ్రీవెన్స్‌లో నిరసన తెలుపుతున్న రైతులు

పెరంబూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లాలో పారిశ్రామిక వాడ ఏర్పాటు యోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని కోరుతూ రైతులు నిరసన తెలిపారు. జిల్లాలోని కినత్తుకడవు తాలూకా మేట్టువావి ప్రాంతంలో 1,500 ఎకరాల్లో 'సిప్కాట్' పారిశ్రామికవాడ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్ట్ కోసం రైతుల నుంచి భూములు సేకరించేందుకు, రాత్రి సమయాల్లో 'డ్రోన్' ద్వారా పరిశీలిస్తున్నారు. ఈ ప్రాంతంలో సిప్కాట్ ఏర్పాటుకు రైతులు తీవ్ర నిరసన తెలుపుతున్నారు. ఈ ప్రాంతంలో వ్యవసాయంతో పాటు సెరికల్చర్, మేకలు, కోళ్ల పెంపకం, పాడి పరిశ్రమలున్నాయని, ఈ ప్రాంతంలో వర్షాలు బాగా కురుస్తుండడంతో వ్యవసాయం సుభిక్షంగా ఉంటుందని, ఈ ప్రాంతంలో సిప్కాట్ ఏర్పాటుచేసే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆ ప్రాంత రైతులు కోరుతున్నారు. ఈ మేరకు వినతిపత్రాన్ని శనివారం జరిగిన గ్రీవెన్స్‌లో ఆ ప్రాంత రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిప్కాట్ ఏర్పాటు ఉపసంహరించుకోవాలని రైతులు నినాదాలు చేశారు.

విద్యార్థులకు రైఫిల్ షూటింగ్ పోటీలు



పెరంబూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ డైనమిక్ ఎయిర్ గన్ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు రైఫిల్ షూటింగ్ పోటీలు శనివారం జరిగాయి. ఈ పోటీల్లో పలు జిల్లాలకు చెందిన 180 మంది పాల్గొన్నారు. 10 మీ టర్ల షూటింగ్ పోటీల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఎస్ఐపై దాడిచేసిన రౌడీ అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యాసర్పాడిలో ఎస్ఐపై కత్తితో దాడిచేసేందుకు యత్నించిన రౌడీని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎంకేబీ నగర్ ఎస్ఐ తన సిబ్బందితో గత నెల 30వ తేది వ్యాసర్పాడి బీవీ కాలని ప్రాంతంలో తనిఖీలు చేపట్టిన సమయంలో ఆ ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని గుర్తించారు. పోలీసులను చూసి అతడు పారిపోయేందుకు ప్రయత్నించగా అతడిని వెంబడించారు. ఎస్ఐ ముందుగా వెళ్లి రౌడీని పట్టుకొనేందుకు యత్నించగా, అతను కత్తితో ఎస్ఐపై దాడి చేసేందుకు యత్నించగా, అంతలో అక్కడకు చేరుకున్న పోలీసులు ఎస్ఐని రక్షించాడు. అంతలో ఆగోడ దూకి పరారయ్యాడు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు, వ్యాసర్పాడి బీవీ కాలనీకి చెందిన కదిర్ అలియాస్ కదిరవన్‌ను అరెస్ట్ చేసి, అతడి నుంచి రెండు సెల్‌ఫోన్లు, పట్టా కత్తి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై ఎంకేబీ నగర్ సహా పలు పోలీస్ స్టేషన్ల లో 2 హత్యలు, 6 హత్యాయత్నాలు సహా 11 కేసులున్నట్లు గుర్తించారు. కదిర్‌ను కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించి గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ ప్రకటన విడుదల చేసింది.

సీమాన్ పార్టీ నుండి వైదొలగిన కార్యకర్తలు

ప్యారీస్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా నామ్ తమిళర్ కట్చి (ఎన్‌టీకే)కు చెందిన 60 మంది కార్యకర్తలు ఆ పార్టీ నుండి వైదొలగినట్లు ఆదివారం ప్రకటించారు. ఆ పార్టీ ఆర్గనైజర్ సీమాన్ వ్యవహారం నచ్చక నవంబరు నుంచి సేలం జిల్లా కార్యదర్శి తంగదురై, మెట్టూరు నగర అధ్యక్షుడు జీవానందం సహా 500 మందికి పైగా పార్టీ నుండి బయటికి వచ్చి ఇతర పార్టీల్లో చేరారు. అలాగే గత వారం కూడా సేలం పశ్చిమ జిల్లా ఎన్‌టీకే ట్రెజరర్ శంకర్ 200మంది కార్యకర్తలతో పార్టీకు గుడ్‌బై చెప్పారు. ప్రస్తుతం సేలం పశ్చిమ జిల్లా కార్యదర్శి తమిళరసన్ నేతృత్వంలో 60మంది కార్యకర్తలు ఎన్‌టీకే పార్టీ పదవుల నుండి వైదొలుగుతున్నట్లు మీడియాకు తెలియజేశారు.

కోవై మెట్రోరైలు ప్రాజెక్ట్: భూసేకరణకు రూ.154 కోట్ల కేటాయింపు



కోవై మెట్రో ప్రాజెక్ట్ వివరాలు తెలుపుతున్న సీఎంఆర్‌ఎల్ అధికారులు (ఫైల్ ఫొటో)

పెరంబూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ మెట్రోరైలు ప్రాజెక్ట్ భూసేకరణకు చెన్నై మెట్రో రైలు లిమిటెడ్ (సీఎంఆర్‌ఎల్) రూ.154 కోట్లు కేటాయించింది. తొలి విడతగా గణపతి టెక్స్‌టైల్ బ్రిడ్జి నుంచి సూర్య ఆస్పత్రి జంక్షన్ వరకు 1.1 కి.మీ మేర రోడ్డుకు తూర్పువైపున్న భూమి సేకరించాల్సి ఉంది. కోవై అవినాశి రోడ్డు, శక్తి రోడ్డు రెండు మార్గాల్లో 34.8 కి.మీ మేర మెట్రో రైలు మార్గం ఏర్పాటుకానుంది. మొదటి మార్గం ఉక్కడం బస్టాండ్ నుంచి ప్రారంభమై విమానాశ్రయం మీదుగా నీలంబూర్ ఇంటిగ్రేటెడ్ స్టేషన్ వరకు 20.4 కి.మీ ఏర్పాటుకానుంది. అలాగే, రెండో మార్గం రైల్వేస్టేషన్ నుంచి ప్రారంభమై శక్తి రోడ్డు, వలియంపాళయం జంక్షన్ వరకు 14.4 కి.మీ మేర ఏర్పాటు చేస్తారు. ఈ ప్రాజెక్ట్ కోసం భూసేకరణ ప్రారంభించిన సీఎంఆర్‌ఎల్ తొలివిడతగా రూ.154 కోట్లు కేటాయించింది. నగరంలో మెట్రోరైలు సంస్థ కార్యాలయం ఏర్పాటుకు సీఎంఆర్‌ఎల్‌కు స్థలం కేటాయించినట్లు కోవై కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

అన్నాడీఎంకే నేత అరెస్టు

అడయార్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూరు, నొచ్చికుప్పంలో అన్నాడీఎంకే విభాగం సహాయ కార్యదర్శి కాశీనాథన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. బహిరంగంగా ఇద్దరు యువతులతో పాటు ఒక మహిళ చీర పట్టుకునిలాగడంతో కిందపడిపోయింది. దీన్ని అవమాన భారంగా భావించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన మైలాపూర్ ఆల్ ఉమెన్స్ పోలీసులు కాశీనాథన్‌ను అరెస్టు చేశారు.

కోవైలో బధిరులకు నివాసాలు

● త్వరలో ప్రారంభం

అడయార్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన కోయంబత్తూరులో బధిరులకు అధునాతన సౌకర్యాలతో పక్కా గృహాలను నిర్మించారు. వీటిని త్వరలోనే ప్రారంభించనున్నారు. 2021లో స్టాలిన్ సారథ్యంలో రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం ఏర్పాటైంది. ఆ తర్వాత సొంత ఇల్లులేని 115 మంది దివ్యాంగులకు కోవై సమీపంలోని చెట్టిపాళయంలో అధునాతన సౌకర్యాలతో పక్కా గృహాలను నిర్మించారు. ఈ ఇళ్ళ నిర్మాణ పనులన్నీ పూర్తి కావడంతో త్వరలోనే ప్రారంభించి, దివ్యాంగ లబ్దిదారులకు అందజేయాలని జిల్లా అధికారులు నిర్ణయించారు. దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా గృహాలు నిర్మించడం రాష్ట్రంలో ఇదే తొలిసారి కావడం గమనార్హం.

ఆన్‌లైన్ రమ్మీలో రూ.70 లక్షలు నష్టం.. లారీ డ్రైవర్ ఆత్మహత్య

అడయార్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జిల్లా కుమారపాళెయం సమీపంలోని సడైయంపాళెయం ప్రాంతానికి చెందిన తమిళ్‌మణి (40) అనే లారీ డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆన్‌లైన్ రమ్మీకి బానిస అయిన తమిళ్‌మణి... ఈ జూదంలో ఏకంగా రూ.70 లక్షల మేరకు కోల్పోయాడు. దీంతో మానసింగా కుంగిపోయిన ఆయన... ఆత్మహత్య చేసుకుంటానంటూ ఓ సెల్ఫీ వీడియో చేసి బలవన్మరణానికి పాల్పడ్డాడు. అలాగే ఆన్‌లైన్ రమ్మీ తనకు అలవాటు చేసిన ప్రకాష్, బాలాజీ, విజయకుమార్‌లే తన ఆత్మహత్యకు కారణమని పేర్కొన్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

తిరుత్తణిలో 82 జంటలకు వివాహ వేడుకలు





ఆలయం వద్ద గుమికూడిన భక్తులు జి తిరుత్తణి ఘాట్‌రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

తిరుత్తణి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి మురుగన్ ఆలయంలో ఆదివారం 82 మంది జంటలకు వివాహాలు జరిగాయి. ఆలయానికి పండుగ సందర్భాల్లో వచ్చే భక్తుల రద్దీవల్ల కొండపై వెళ్లే

పెరిగిన భక్తుల రద్దీ

వాహనాలకు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగి భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై అధికారులు పట్టించుకోవట్లేదని, గతంలో కూడా పలుసార్లు ఫిర్యాదులు చేశామని హిందూ ధార్మిక సంఘాల నేతలు తెలుపుతున్నారు. ఆదివారం కూడా తిరుత్తణి ఘాట్‌రోడ్డులో అధిక సంఖ్యలో వాహనాల రావడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఇకనైనా ఆలయ నిర్వాహకులు భక్తులంతా సులువుగా మురుగన్‌ను దర్శించుకునేలా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

వండలూరు జూలో పులికి శస్త్రచికిత్స

పెరంబూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక వండలూరు జూ పార్క్‌లో పులికి నిర్వహించిన శస్త్రచికిత్స విజయవంతమైంది. ఈ మేరకు పార్క్ అధికారులు విడుదల చేసిన ప్రకటనలో... జూ పార్క్‌లో సంరక్షిస్తున్న నకులన్ అనే 9 ఏళ్ల మగ పులి మెడ కుడివైపు కణితిని వైద్యులు శస్త్రచికిత్స ద్వారా తొలగించారని తెలిపింది. ఇందుకోసం గ్యాస్ అనస్థీషియా ప్రక్రియతో కణితి పూర్తిగా తొలగించామన్నారు. రక్తస్రావం ఎక్కువగా జరగకుండా కణితికి దారితీసే నాళాలు మూసివేశారు. చికిత్స అనంతరం నకునల్‌ను వైద్య బృందం పర్యవేక్షించింది. మరుసటిరోజు పులి ఆహారం తీసుకుంటూ చురుగ్గా ఉందని పార్క్ అధికారులు తెలిపారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు ముమ్మరం



మైదానాన్ని చదును చేస్తున్న దృశ్యం

పెరంబూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కడలూరులో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా, మంజకుప్పం మైదానం పునరుద్ధరణ పనులు ప్రారంభమయ్యాయి. ముఖ్యమంత్రి స్టాలిన్, జిల్లాల వారిగా పర్యటిస్తూ ప్రభుత్వ పథకాల అమలు, లబ్దిదారులకు సంక్షేమ సహాయాలు అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో, కడలూరు జిల్లాలో ఈ నెల 21,22 తేదీల్లో ముఖ్యమంత్రి పర్యటించనున్నారు. జిల్లా యంత్రాంగం సీఎం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు ముమ్మరం చేసింది. కడలూరు మంజకుప్పం మైదానంలో సీఎం సభ జరుగనున్న నేపథ్యంలో మైదానం చదును చేయిస్తున్నారు.

కత్తితో బెదిరించి దోపిడీ.. రౌడీ అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): దుకాణ యజమానిని కత్తితో బెదిరించి దోపిడీకి పాల్పడిన రౌడీని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరువిక నగర్ భాష్యం ప్రాంతానికి చెందిన గౌతమ్, పెరంబూర్ ఎస్సార్పీ ఆలయ వీధిలో చిల్లర దుకాణం నడుపుతున్నాడు. గత నెల 31వ తేది ద్విచక్రవాహనం వచ్చిన వ్యక్తి, మద్యం తాగేందుకు డబ్బులివ్వాలని గౌతమ్‌ను అడిగాడు. అతను నిరాకరించడంతో కత్తితో బెదిరించి పెట్టె నుంచి రూ.1,000 నగదు తీసుకొని పరారయ్యాడు. గౌతమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు వ్యాసర్పాడి రంగనాధన్ వీధికి చెందిన నియమదుల్లా ను అరెస్ట్ చేశారు. నియమదుల్లాపై వ్యాసర్పాడి సహా పలు పోలీస్ స్టేషన్లలో 16 కేసులున్నాయని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపింది.

దోపిడీ కేసులో ఇద్దరి అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ థామస్ మౌంట్‌లో ఓ ఇంట్లో దోపిడీకి పాల్పడిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. సెయింట్ థామస్ మౌంట్ శ్రీపురం కాలనీకి చెందిన సిరాజ్ థామస్ సెరియన్ గత నెల 10వ తేది వ్యాపార నిమిత్తం హైదరాబాద్ వెళ్లగా, అయన తల్లి కేరళలోని కుమార్తె ఇంటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో, గత నెల 28వ తేది ఇంటి తాళాలు బద్దలుకొట్టి ప్రవేశించిన గుర్తుతెలియని వ్యక్తులు, బీరువాలు, అల్మారాలు గాలించినా ఎలాంటి ఆభరణాలు, నగదు లభించకపోవడంతో ఇంట్లోని వస్తువులు ధ్వంసం చేసి వెళ్లారు. ఈ ఘటనపై సిరాజ్ థామస్ ఫిర్యాదుతో కేసు నమోదుచేసిన సెయింట్ థామస్ మౌంట్ పోలీసులు, ఈ చర్యకు పాల్పడిన బీసెంట్‌నగర్‌కు చెందిన సంతోష్, నొచ్చికుప్పంకు చెందిన మోజస్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

కమ్యూనిటీ హోల్ వరండాలోనే తరగతులు



వరండాలో కూర్చొన్న విద్యార్థులు

పెరంబూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లా లింగనూరులోని పనిచేస్తున్న కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణాలు అర్థాంతరంగా ఆగిపోవడంతో, కమ్యూనిటీ హాలు వరండాలోనే విద్యార్థులు చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పాఠశాలలో 50 మందికి పైగా విద్యార్థులు చదువుతుండగా, తగినన్ని తరగతి గదులు లేవు. ఈ క్రమంలో, పాఠశాల భవనం నిర్మించేందుకు గత ఏడాది జూన్ 4న పనులు ప్రారంభించారు. దీంతో, పాఠశాల సమీపంలోని కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో ఏడు నెలలుగా విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో, కొంత కాలంగా నిర్మాణ పనులు హఠాత్తుగా నిలిచిపోయాయి. ఈ విషయమై ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తిపై స్పందించిన కార్పొరేషన్ కమిషనర్, 15 రోజుల్లో నిర్మాణాలు పూర్తిచేయాలని ఇంజనీర్లను ఆదేశించారు.

నేడు వేంగైవయల్ కేసు తీర్పు

ప్యారీస్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా వేంగైవయల్ దళిత కాలనీలో వాటర్‌ట్యాంకులో మానవ వ్యర్థాల కేసు తీర్పు సోమవారం వెలువరించనున్నారు. గత రెండేళ్ల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు తాగునీటి ట్యాంకులో మానవ వ్యర్థాలు కలిపిన వ్యవహారం రాష్ట్రవాప్తంగా చర్చనీయాంశమైంది. దీనికి కారణమైనవారి ఆచూకీ తెలియని పరిస్థితుల్లో, పోలీసు శాఖ పలుకోణాలలో దర్యాప్తు సాగించింది. గత నెల 20వ తేదీ రాష్ట్రప్రభుత్వం న్యాయస్థానంలో దాఖలు చేసిన ఛార్జ్‌షీటులో ఆదేగ్రామానికి చెందిన కానిస్టేబుల్ మురళి, రాజా, సుదర్శన్, ముత్తుకృష్ణన్‌లకు సంబంధాలున్నట్లు ఆరోపించింది. డీఎన్ఏ టెస్ట్ ఫలితాల ఆధారంగా ఈ ముగ్గురిని ఛార్జ్‌షీట్లో నిందితులుగా చేర్చింది. కాగా గత 27వతేదీ పుదుకోట అంటరానితనం నిర్మూలన న్యాయస్థానంలో కనకరాజ్ అనే గ్రామస్తుడు పిటిషన్ వేశారు. అందులో రాష్ట్రప్రభుత్వం దాఖలుచేసిన ఛార్జ్‌షీట్‌లో వేర్వేరుగా ఉన్నాయని అందువల్ల ఆ ఛార్జ్‌షీట్ రద్దుచేయాలని, లేని పక్షంలో ఈ కేసును సీబీఐకి బదిలీ చేయాలని కోరారు. ఇదిలా ఉండగా గత శుక్రవారం వేంగైవయల్ కేసు విచారణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది మోహన్, ప్రభుత్వ తరుపు న్యాయవాది కుమార్‌లు హాజరై వాదించారు. ఈ కేసుకు సంబంధించిన తుది విచారణను సోమవారానికి న్యాయమూర్తి వాసంతి వాయిదా వేశారు.

థియేటర్ నీటితొట్టెపై నిలబడి యువతి ఆత్మహత్యా బెదిరింపు

చెన్నై, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఓ థియేటర్ నీటి తొట్టెపై నిలిచి ఓ యువతి ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదరించిన సంఘటన తండయార్‌పేటలో చోటుచేసుకుంది. ఓల్డ్ వాషర్‌మెన్‌పేట సోలయప్పన్ వీధికి చెందిన గీత (31) అనే వితంతువు శనివారం సాయంత్రం తండ్రితోపాట ఆటోలో వెళ్ళింది. తండయార్‌పేట టీహెచ్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య కారణంగా ఆటో ఆగినప్పుడు గీతా ఆటోలోంచి దిగి పక్కనే ఉన్న సినిమా థియేటర్లోకి పరుగెత్తింది. ఆ థియేటర్ మిద్దెపైనున్న వాటర్ ట్యాంక్‌పై నిలిచి నటుడు విజయ్‌ని చూడాలంటూ కేకలు వేసింది. అంతటితో ఆగకుండా కిందుకు దూకి ఆత్మహత్య చేసుకుంటానని బెదరించింది. దీంతో థియేటర్ సిబ్బంది, సినిమా చూస్తున్న ప్రేక్షకులు దిగ్భ్రాంతి చెందారు. వెంటనే తండయార్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెళ్లి ఆమెతో మాట్లాడి చాకచక్యంగా కిందకు దింపి స్టేషన్‌కు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో గీత పోలీసు అధికారులను కిందకు తోసి దాడి జరిపేందుకు ప్రయత్నించారు. గత కొంతకాలంగా గీత మానసిక పరిస్థితి బాగా లేదని తండ్రి ద్వారా తెలుసుకున్న పోలీసులు ఆమెను కీల్పాక్‌లోని మానసిక వైద్యశాలకు తరలించారు.

ప్రభాకరన్ వద్ద షూటింగ్ నేర్చుకున్నాను: సీమాన్

ప్యారీస్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎల్టీటీఈ నేత ప్రభాకరన్ వద్ద తాను రైఫిల్ షూటింగ్ నేర్చుకున్నట్లు నామ్ తమిళర్ కట్చి (ఎన్‌టీకే)ఆర్గనైజర్ సీమాన్ చెప్పడం మళ్లీ రాష్ట్రంలో చర్చనీయాంశమైంది. ఈరోడ్ తూర్పు నియోజకవర్గ ఉప ఎన్నికలో ఎన్‌టీకే అభ్యర్థికి మద్దత్తుగా శనివారం రాత్రి జరిగిన బహిరంగసభలో సీమాన్ పాల్గొని ప్రసంగించారు. ఏకే74 రైఫిల్ షూటింగ్ శిక్షణ తాను ప్రభాకరన్ దగ్గర నేర్చుకున్నానన్నారు. ఈ రకం రైఫిల్ రష్యా సైనికుల వద్ద మాత్రమే ఉందని, భారతదేశంలో ఇంతవరకు లేదని, శిక్షణ సమయంలో ప్రభాకరన్ తనకు చెప్పినట్లు సీమాన్ వివరించారు. ఒకేరోజు తనపై దాదాపుగా వెయ్యి కేసులు నమోదయ్యాయని అయితే పరుల ఆస్తులను లాక్కొని మోసాలనికి పాల్పడలేదని, తప్పు ఎక్కడజరిగినా దాని గురించి ఇలాంటి సభల ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నందు వల్లే తనను ద్రావిడ నేతలు వ్యతిరేకిస్తున్నారని సీమాన్ తెలిపారు.

ఘర్షణ



ఈరోడ్‌లో ఘర్షణ పడుతున్న నామ్‌తమిళర్‌కట్చి, పెరియార్ ద్రావిడ కళగం కార్యకర్తలు

తమిళ చిత్రజ్యోతి

జీవీ ప్రకాష్ - దివ్యభారతి
జంటగా ‘కింగ్‌స్టన్’


‘కింగ్‌స్టన్’లో జీవీ ప్రకాష్ - దివ్యభారతి

జీ స్టూడియోస్ - పేరలల్ యూనివర్స్ పిక్చర్స్ సంయుక్తంగా జీవీ ప్రకాష్ కుమార్, దివ్యభారతి జంటగా నటించిన తాజా చిత్రం ‘కింగ్‌స్టన్’. ఇతర పాత్రల్లో అళగర్ పెరుమాళ్, అంటోనీ, సేత్తన్, కుమరవేల్, సబుమోన్ తదితరులు పోషించారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ సంగీతం అందించారు. ఈ మూవీ ఫస్ట్‌లుక్‌ను తాజాగా రిలీజ్ చేశారు. సముద్ర నేపథ్యంలో ఫాంటసీ అడ్వెంచర్ మూవీగా తెరకెక్కించారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ పోస్ట్‌ప్రొడక్షన్ నిర్మాణ పనులను శరవేగంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల టీజర్‌ను రిలీజ్ చేయగా, తాజాగా ‘రాసా.. రాసా...’ అంటూ సాగే ఫస్ట్ సింగిల్ విడుదల చేశారు. మార్చి 7వ తేదీన వరల్డ్‌వైడ్‌గా రిలీజ్ కానుంది. కాగా, జీవీ, దివ్యభారతి జంటగా 2021లో వచ్చిన ‘బ్యాచిలర్’ మూవీ మంచి ప్రజాదారణ పొందిన విషయం తెల్సిందే.

త్వరగా పెళ్ళి చేసుకోండి.. హీరో జైకి యోగిబాబు సలహా

త్వరగా వివాహం చేసుకుని ఓ ఇంటివాడు కావాలని కోలీవుడ్‌లో పెళ్ళికాని హీరో జైకి హాస్య నటుడు యోగిబాబు సలహా ఇచ్చారు.. ఇంకా సింగిల్‌గా ఉండటం ఏమాత్రం మంచిది కాదన్నారు. బి.యువరాజ్ నిర్మాణంలో యువ రాజ్ ఫిలిమ్స్ పతాకంపై ప్రతాప్ దర్శకత్వం వహించిన చిత్రం ‘బేబీ-బేబీ’. సత్యరాజ్, జై, యోగిబాబు, ప్రగ్యా నగ్రా తదితరులు నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ. ఉమ్మడి కుటుంబంలో ఊహించని విధంగా వచ్చిన ఒక చంటిబిడ్డ కారణంగా ఆ కుటుంబంలో జరిగే పరిణామాలను వినోదాత్మకంగా దర్శకుడు తెరకెక్కించారు. త్వరలో విడుదల కానున్న ఈ మూవీ ఆడియో, ట్రైలర్‌ను శనివారం రాత్రి నగరంలో విడుదల చేశారు. దర్శకుడు ప్రతాప్ మాట్లాడుతూ, ‘స్క్రిప్టు సిద్ధం కాగానే యోగిబాబును సంప్రదించగా, ఆయన ఓకే చెప్పడంతో నిర్మాత యువరాజ్‌ను సంప్రదించాను. ఆయన కూడా అంగీకరించడంతో ఇతర నటీనటుల ఎంపిక సాఫీగా సాగిపోయింది. సత్యరాజ్‌కు కీర్తన జోడీగా నటించారు. ఇమ్మాన్ సంగీతం సినిమాకు బలం. ప్రతి ఒక్కరికీ నచ్చేలా సినిమాను రూపొందించాం’ అన్నారు. నటుడు సత్యరాజ్ మాట్లాడుతూ, ‘విజయ్, అజిత్ వంటి పెద్ద హీరోల సరసన నటించిన కీర్తన ఇందులో నాకు జోడీగా నటించారు. అంటే నేను ఇంకా యువకుడినే. నిర్మాత అమాయకుడులా కనిపించినా మంచి తెలివైన వ్యక్తి. భారీ తారాగణంతో ఈ సినిమాను ఎంతో బ్యూటీఫుల్‌గా తీశారు. ఈ సినిమా చూసేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. హీరో జై మాట్లాడుతూ, ‘ఈ స్టోరీ వినగానే సత్యరాజ్, యోగిబాబు ఓకే చెప్పడంతో నేను కూడా మరోక్షణం ఆలోచన చేయకుండా ఓకే చెప్పేశాను. లోకేషన్‌లో యోగిబాబు, సత్యరాజ్ కలిసి కడుపుబ్బ నవ్విస్తూనే ఉంటారు. దర్శకుడు పక్కా ప్లాన్‌తో చిత్రీకరణ పూర్తి చేశారు. కత్తిపోట్లు, గొడ్డలివేట్లు, రక్తం వంటి హింసాత్మక సన్నివేశాలు లేకుండా మనసువిప్పి హాయిగా నవ్వుకునే చిత్రంగా ఉంటుంది’ అని పేర్కొన్నారు.


‘బేబీ-బేబీ’ ఆడియో రిలీజ్ దృశ్యం



అందుకే స్టార్ హీరో కాలేకపోయాను
● సిద్ధార్థ్

తాను మహిళలను కించపరుస్తూ, అమ్మాయిల నడుములు గిల్లుతూ ఉండే పాత్రల్లో నటించలేదని, అందుకే తాను స్టార్ హీరో కాలేకపోయానని హీరో సిద్ధార్థ్ అన్నారు. ఒకపుడు తెలుగులో క్రేజీ హీరోగా, లవర్‌బాయ్‌గా గుర్తింపు పొందిన సిద్ధార్థ్ ఇపుడు.. ఒకటి రెండు చిత్రాల్లో నటిస్తున్నారు. ఇటీవల ‘ఇండియన్-2’, ‘మిస్ యూ’ చిత్రాల తర్వాత ప్రస్తుతం ‘టెస్ట్’, ‘ఇండియన్-3’తో పాటు తన 40వ చిత్రంలో నటిస్తున్న సిద్ధార్థ్ తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో స్టార్ హీరో కాలేకపోవడానికి గల కారణాలను వివరించారు. ‘సినిమాల్లో అమ్మాయిల నడుములు గిల్లడం, వారిని కొట్టి చిత్రహింసలు పెట్టడం వంటి సన్నివేశాల్లో నేను నటించడం లేదు. దీనికి కారణం.. ఎల్లపుడూ నేను మహిళలను ఎంతో ఉన్నత భావంతో గౌరవంగా చూస్తాను. మహిళలను కించపరిచే పాత్రల్లో నటించి వుంటే నేను కూడా పెద్ద స్టార్‌ను అయి వుండేవాడిని అని వివరించారు. కాగా, ఇటీవలికాలంలో సిద్ధార్థ్ చేసే వ్యాఖ్యలు వివాదాస్పదమవుతున్నాయి.

‘అస్త్రం’లో పోలీస్ ఆఫీసర్‌గా శ్యామ్

నటుడు శ్యామ్ హీరోగా నటించిన తాజా చిత్రం ‘అస్త్రం’. అరవింద్ రాజగోపాల్ దర్శకుడు. నిరంజని, నిళల్‌గల్ రవి, అరుల్ డి.శంకర్, జీవా రవి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ధన షణ్ముగ మూర్తి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీ ట్రైలర్‌ను అనేక మంది సినీ ప్రముఖులు, హీరోలు, హీరోయిన్లు వారివారి సోషల్ మీడియా వేదికల్లో విడుదల చేశారు. ఇందులో తనకు అచ్చొచ్చిన పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించారు. వరుస హత్యలకు పాల్పడుతున్న సీరియల్ కిల్లర్ ఎవరో గుర్తించలేక క్లిష్టపరిస్థితులు, తన విధులను ఆటంకం కలిగించడం వంటి అంశాలను ఈ ట్రైలర్‌లో చూపించారు. ‘మతం మార్చుకుంటేనే మంచి చేస్తామని చెప్పేవాడు దేవుడు కాదు.. రాజకీయ నాయకుడు’ అని చెప్పే రాజకీయ డైలాగులు ఉండటం ట్రైలర్‌పై ఆసక్తిని కలిగించేలా ఉన్నాయి. ఈ మూవీని ఈ నెల 28వ తేదీన విడుదల చేయనున్నారు.


‘అస్త్రం’లో శ్యామ్

తిరుచెందూరుకు పోటెత్తిన భక్తులు


ఆలయ ప్రాంగణం వద్ద గుమికూడిన భక్తులు

చెన్నై, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవక్షేత్రం తిరుచెందూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దర్శనం కోసం ఆదివారం వేల సంఖ్యలో భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. ఆదివారం శుభ ముహూర్త దినం కావటంతో భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. దక్షిణాది రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో వచ్చిన భక్తులు వేకువజామునే భక్తులు సముద్రతీరంలో స్నానమాచరించి, నాళికినరులో పవిత్ర జలాలను శిరస్సుపై చల్లుకుని క్యూలైన్లలో నిలిచారు. ఆలయ మండపంలో ఆదివారం ఉదయం యాభైకి పైగా వివాహాలు జరిగాయి. ఓ వైపు స్వామివారి దర్శనానికి, మరో వైపు పెళ్ళి వేడుకల్లో పాల్గొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో రావటంతో ఆలయ ప్రాంగణం భక్తజన సంద్రంగా మారింది.

వడపళని కావేరి హాస్పిటల్‌కు జేసీఐ గుర్తింపు



మీడియా సమావేశంలో డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్, డాక్టర్ అయ్యప్పన్ పొన్నుసామి

చెన్నై, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రోగుల భద్రత, అంకితభావంతో అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన వైద్యం అందిస్తున్నందుకుగాను వడపళనిలోని కావేరి హాస్పిటల్‌కు జాయింట్ కమిషన్ ఇంటర్నేషనల్ (జేసీఐ) సంస్థ స్వర్ణముద్రిక గుర్తింపు లభించినట్లు కావేరి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్ తెలిపారు. ఈ గుర్తింపుతో తమ ఆస్పత్రి వైద్యులు మరింత సేవాభావంతో రోగులకు వైద్యసేవలందిస్తారని ఆయన చెప్పారు. వడపళని ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ విషయాన్ని ప్రకటించారు. ఈ సమావేశంలో కావేరి హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అయ్యప్పన్ పొన్నుసామి తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ మారథాన్‌కు అపూర్వ స్పందన


క్యాన్సర్ అవగాహన మారథాన్ ప్రారంభిస్తున్న ఈస్ట్‌జోన్ జాయింట్ కమిషనర్ విజయ్‌కుమార్

చెన్నై, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ క్యాన్సర్ దినం ముందస్తు కార్యక్రమంలో భాగంగా ఆళ్వార్‌పేటలోని కావేరి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం వేకువజామున బిసెంట్‌నగర్‌లో కే10కే క్యాన్సర్ అవగాహన మారథాన్‌కు అపూర్వ స్పందన లభించిందని కావేరి గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్ తెలిపారు.ఈ మారథాన్‌ను ఈస్ట్‌జోన్ పోలీస్ జాయింట్ కమిషనర్ డా.పి.విజయ్‌కుమార్, జీసీసీ కమిషనర్ కుమార గురుబరన్ ప్రారంభించారు.బిసెంట్‌నగర్ ఆల్కాట్ మెమోరియల్ హయ్యర్ సెకండరీ స్కూలు వద్ద 10 కి.మీ, 5 కి.మీ ఇలా రెండు రకాలుగా జరిగిన ఈ పరుగు కార్యక్రమంలో క్రీడాకారులు, విద్యార్థులు, కార్పొరేట్ సంస్థల ఉద్యోగులు పాల్గొన్నారు. రేడియేషన్ ఆంకాలజీ డైరెక్టర్ డాక్టర్ ఏఎన్ వైద్యనాథన్, తదితరులు పాల్గొన్నారు.


చెన్నై నంగనల్లూరులోని శ్రీశివన్ సభ, సిద్ధి వినాయకుడి ఆలయ గోపురంపై కుంభాషేకం నిర్వహిస్తున్న వేద పండితులు











ర్యాంప్‌పై హొయలు
ఫ్యాషన్ షోలో అలరించిన భామలు

చెన్నై, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండీలోని స్టార్ హోటల్‌లో భారత తోలువస్తువుల ఉత్పత్తి, ఎగుమతి దారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యాషన్‌షో అందరినీ ఆకట్టుకుంది. స్వదేశీ తోలు వస్తువులు పట్టుకుని వయ్యారంగా అందాలభామలు రాంప్ వాక్ చేసి ప్రేక్షకులను మైమరపించారు. ఇదే రీతిలో యువకులు, బాలురు ఇతర మోడల్స్ కూడా ర్యాంప్ వాక్ చేశారు. గంటకు పైగా జరిగిన ఈ ఫ్యాషన్‌షోలో ప్రముఖ మాడల్స్ తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించి అటు నిర్వాహకులను ఇటు వీక్షకులను బాగా ఆకట్టుకున్నారు.



సమయపురంలో తైపూస ఉత్సవాల ప్రారంభం


ధ్వజ పతకాన్ని ఎగురవేస్తున్న ఆలయ ప్రధానార్చకులు

చెన్నై, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవ క్షేత్రం సమయపురం మారియమ్మన్ ఆలయంలో తైపూస ఉత్సవాలు ఆదివారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి (ఉత్సవమూర్తి)కి ప్రత్యేక అభిషేకం, ఆరాధన నిర్వహించారు. అనంతరం అమ్మవారు దారు సప్పరంలో మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ ఎదుట కొలువుదీరారు. అదే సమయంలో అమ్మవారి రూపంలో ఉన్న పతాకాన్ని స్వర్ణధ్వజస్తంభంపై ఆలయ ప్రధానార్చకులు ఎగురవేశారు. ఈ వేడుకల్లో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. ఆ తర్వాత కంకణధారణ, ధ్వజస్తంభానికి మహాదీపారాధన నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ ట్రస్టుబోర్డు అధ్యక్షుడు ఇళంగోవన్, ఆలయ డిప్యూటీ కమిషనర్ ప్రకాష్, సభ్యులు సుగంధి, లక్ష్మణన్ పిచ్చైమణి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

పూజా వేళల మార్పు...

తిరుచెందూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో షణ్ముఖ వార్షికోత్సవం, తైపూసం వేడుకలను పురస్కరించుకుని పూజా కార్యక్రమాల వేళల్లో మార్పులు చేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ జ్ఞానశేఖరన్ తెలిపారు. ఆలయ ఉత్సవమూర్తి కడలిలో లభమైన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ నెల 10న షణ్ముఖుడి వార్షికోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. షణ్ముఖుడి ఉత్సవాలను పురస్కరించుకుని ఆ రోజు ఆలయాన్ని వేకువజాము 4గంటలకు తెరుస్తామని, 4.30 కి విశ్వరూప దీపారాధన, ఉదయం 6 గంటలకు ఉదయమార్తాండ అభిషేకం, 10 గంటలకు షణ్ముఖుడికి అభిషేకం, మధ్యాహ్నం 3 గంటలకు ప్రదోష అభిషేకం, సాయంత్రం 4 గంటలకు సంధ్యాదీపారాధన, సాయంత్రం 5 గంటలకు స్వామి అలవాయుక్త పెరుమాళ్ ఊరేగింపు జరుగనున్నాయి. ఇదే విధంగా ఈ నెల 11న తైపూస ఉత్సవాలను పురస్కరించుకుని అర్ధరాత్రి ఒంటి గంటకు ఆలయాన్ని తెరచి 1.30 గంటలకు విశ్వరూప దీపారాధన, వేకువ జామున నాలుగు గంటలకు ఉదయమార్తాండాభిషేకం, ఉదయం 6 గంటల నుండి 6.30 గంటల వరకు తీర్థవారీ జరుగుతాయి. 10 గంటలకు షణ్ముఖుడికి అభిషేకం, మధ్యాహ్నం ఒంటిగంటకు స్వామి అలవాయుక్త పెరుమాళ్ తైపూస మండపానికి బయలుదేరి, సాయంత్రం 5 గంటలకు ఆలయాన్ని చేరుకుంటారు. ఆ తర్వాత తక్కిన పూజాది కార్యక్రమాలు జరుగుతాయని ఆయన వివరించారు.

వైభవంగా వసంత పంచమి వేడుకలు


వినధర మ్యూజిక్ బృందం వీణానాదం

ప్యారీస్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మాఘ శుద్ధపంచమి, వసంత పంచమిని ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. తిరువళ్లూరు సమీపంలోని ఆర్యపాక్కంలో వున్న విద్యారంభ జ్ఞాన మహాసరస్వతి ఆలయంలో అమ్మవారిని పట్టుపీతాంబరాలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. చెన్నై, తిరువళ్లూరు, ఆర్యపాక్కం పరిసరాల్లో ఉన్న పలుగ్రామాల విద్యార్థులు అమ్మవారిని పూజించారు. ఆలయ ధర్మకర్త పీవీ కృష్ణారావు - మణిమాలారావు దంపతులు పిల్లలకు విద్యాసామగ్రి, భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీచేశారు. వసంత పంచమి సందర్భంగా వినధర మ్యూజిక్ బృందం కళాశాలకు వీణానాదంతో సరస్వతి అమ్మవారికి నీరాజనం పలికారు.

విద్యకు పేదరికం అడ్డుకారాదు
● ఏవీసీఈఫ్ వ్యవస్థాపకులు కె.రవికుమార్

ప్యారీస్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య ఛారిటబుల్ అండ్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ (ఏవీసీఈఫ్) పేద విద్యార్థులకు అండగా ఉంటుందని ఎస్వీపీసీ, ఏవీసీఈఫ్‌ల వ్యవస్థాపక అధ్యక్షుడు కె.రవికుమార్ పేర్కొన్నారు. టి.నగర్‌లో ఏవీసీఈఫ్ 16వ రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశం కె.రవికుమార్ అధ్యక్షతన వాసవీ మాత ప్రార్థన, జ్యోతి ప్రజ్వలనతో ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైంది. ఈ సమావేశంలో ఆర్థికంగా వెనుబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉన్నత విద్య కోసం ఉపకారవేతనం అందజేయాలని కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ పథకానికి విరాళాలు అందజేస్తున్న దాతలను ధన్యవాదాలు తెలిపి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సభాధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ, 450 మంది కళాశాల విద్యార్థులకు, మూడు సంవత్సరాలుగా రూ.95 లక్షలు ఉపకార వేతనంగా అందజేసి ప్రోత్సహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి రాధాకృష్ణ బాలాజీ, ట్రెజరర్ బీఎస్ శ్రీధర్, వ్యాపారవేత్తలు కస్తూరి రంగన్, బీబీ మోహన్‌కుమార్, అపోలో సుబ్రమణ్యం, పీఎల్వీ సుబ్బారావు, కుమరవేలు తదితరులు పాల్గొన్నారు.


కార్యవర్గ సమావేశంలో నిర్వాహకులు, అతిథులు

మైమరిపించిన మురళీ రవళి


ఫ్లూట్ కచేరీ చేస్తున్న విద్వాన్ శశిధర్ బృందం

వేళచ్చేరి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కలైమామణి టి.శశిధర్ మురళీ గానకచేరి శ్రోతలను పరవశింపజేసింది. నగరంలోని లజ్ రాగ సుధా హాలులో శనివారం సాయంత్రం విద్వాన్ శశిధర్ వేణునాద కచేరి జరిగింది. ‘ఇసై’ సంస్థ 24వ వార్షికోత్సవం సందర్భంగా విద్వాన్ శశిధర్‌కి ‘ఇసై తెండ్రల్’ బిరుదు ప్రదానం చేశారు. క్వీవ్‌లాండ్ వీవీ సుందరం చేతుల మీదుగా శశిధర్ సత్కారం అందుకున్నారు. సన్మాన కార్యక్రమం అనంతరం శశిధర్ వేణువుపై పలికించిన రాగాలు శ్రోతలను మైమరిపించింది. శశిధర్ వేణువాయిద్య సంగీతంలో జీవం పోసుకుని శ్రోతల ప్రశంసలనందుకున్నాయి. విద్వాన్ టి.శశిధర్ ఫ్లూట్ వాద్య కచేరీకి విద్వాన్ వీవీ రవి వయొలిన్‌పై, విద్వాన్ జయేంద్రకుమార్ మృదంగంపై వాద్య సహకారం అందించారు.


విద్వాన్ శశిధర్‌కు బిరుదు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు